

జ్యోతికి అసలు కన్నీరు ఆగటంలేదు.

"జ్యోతి!... ఛఛ ... ఏమిటి చిన్న పిల్లలా ఈ కన్నీరు!" ఆమె కన్నీరు తుడిచి అన్నాడు శేఖర్.

"అదికాదు శేఖర్, ఐదు సంవత్సరాలు ఎలా గడపాలా అని ఆలోచిస్తున్నాను. అది తలచుకుంటే భయంగా ఉంది, దుఃఖం వస్తున్నది" అన్నది దుఃఖ స్వరంతో.

"అదికాదు, నాకు తెలుసు నువ్వెందుకు ఏడుస్తున్నావో."

జ్యోతి ఏం మాట్లాడలేదు.

తిరిగి శేఖర్ అన్నాడు — "విదేశాలకు వెళ్ళిన ప్రతివాళ్ళు వచ్చేటప్పుడు అక్కడి అమ్మాయిల్ని వివాహం చేసుకొని ఇండియాకు తిరిగి వస్తున్నారు. అలా నేను కూడా నిన్నూ, నీ ప్రేమనూ కాదని ఎవరినైనా పెళ్ళి చేసుకొని వస్తానని కదూ నీ భయం ?"

తన మనసులోని అనుమానాన్ని గ్రహించిన శేఖర్ కళ్ళలోకి సూటిగా చూడలేక తల దించుకొన్నది.

"జ్యోతి ... భగవంతుడి సాక్షిగా చెప్తున్నాను. నేను అమెరికా నుండి తిరిగి వచ్చాక అగ్నిసాక్షిగా నిన్ను నా అర్ధాంగిగా స్వీకరించి మన ప్రేమకు సార్థకత చూపిస్తాను. నిజం జ్యోతి ... నీవు లేకుండా నేను బ్రతకగలనా ? ఈ జీవితాన్ని అనుభవించగలనా ? నీకు తప్ప ఈ హృదయ సామ్రాజ్యంలో మరెవరికీ స్థానం లేదు" అన్నాడు లాలనగా, ఆప్యాయంగా.

"చాలు శేఖర్...చాలు" అన్నది తృప్తిగా జ్యోతి.

మైక్‌లో ఎనౌన్సింగ్ విన్పించింది.

"ఆఁ... ఇక నేను వెడతాను" అన్నాడు తన రెండు సూట్‌కేసుల్ని తీసుకొని.

"శేఖర్, వెళ్తాను కాదు, వెళ్ళి వస్తాను అని చెప్పు" అన్నది జ్యోతి.

ఆమె మూఢ విశ్వాసానికి శేఖర్‌కు నవ్వు వచ్చింది. నవ్వుతూనే "ఆల్‌రైట్ వెళ్ళి వస్తాను" అన్నాడు.

అప్పటివరకు మౌనంగా ఉన్న తన మిత్రుల్ని భుజం తట్టి "ఒరేయ్ రాజా! వినోద్... అప్పుడప్పుడూ జ్యోతిని పలకరించి రండి" అన్నాడు.

"అలాగేరా ఆ మాత్రం మాకు తెలీదా?" అన్నాడు రాజా.

"శేఖర్... టైము అవుతుంది" కర్తవ్యాన్ని గుర్తు చేశాడు వినోద్.

"అమెరికా వెళ్ళగానే ఇండియాకు కేబుల్ పంపించు శేఖర్" అన్నది జ్యోతి.

"అలాగే..." అని ముగ్గురికీ వీడ్కోలిచ్చి ఫ్లైట్ వైపు అడుగులు వేశాడు డాక్టర్ శేఖర్.

కొన్ని నిముషాల్లో విమానం గాల్లో లేచి ఆకాశంలో లీనమైపోయింది.

"పదమ్మా... ఇక వెడదాం ?" అన్నాడు రాజా, జ్యోతిని ఉద్దేశించి.

ముగ్గురూ ఎయిర్‌పోర్టునుండి బయటకు వచ్చారు.

"నేను సిటీ బస్సులో వెడతాను అన్నయ్యా ?" అన్నది జ్యోతి.

"అదేం!... ముగ్గురం టాక్సీలో పోదాము" అన్నాడు రాజా.

"అవునండి, రాజా చెప్పింది బాగుంది" అన్నాడు వినోద్.

"ఫరవాలేదు, నేను బస్సులోనే వెడతాను" అన్నది.

ఆమెను కాదనలేక "సరే..." అన్నారు మిత్రులు యిద్దరూ. జ్యోతి బస్సు ఎక్కి వెళ్ళిపోయింది.

కాలగర్భంలో ఐదు సంవత్సరాలు గడిచాయి.

* * *

రాజా, వినోద్ ఆత్రుతగా రాబోయే విమానం కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళ చేతుల్లో పూలదండలు ఉన్నాయి. కొద్ది నిముషాల్లో విమానం లాండ్ అవుతుందని ఎనౌన్స్‌మెంట్ చేశారు. వాళ్ళ కళ్ళు ఆకాశంవైపే ఆత్రుతగా చూస్తున్నాయి. చెవులు చిల్లులుపడే శబ్దంతో ఎయిర్ ఇండియా బోయింగు విమానం వచ్చి లాండ్ అయింది.

ఒక్కొక్కరే విమానంలోనుండి దిగి వస్తున్నారు. శేఖర్ కన్పించలేదు. ఇంకా రాడేమిటి, ఒకవేళ రాలేదా? వస్తున్నట్లు కేబుల్ యిచ్చాడు. పరిపరి విధాల ఉన్నాయి రాజా, వినోద్ ఆలోచనలు.

అప్పుడే శేఖర్ స్టెప్స్ దిగి తమవైపే వస్తున్నాడు. శేఖర్‌లో చాలా మార్పు వచ్చింది. మనిషిలో ఒక విధమైన హుందాతనం కన్పిస్తున్నది. గతంకంటె ఇప్పుడు ఎర్రగా, దృఢంగా కనిపిస్తున్నాడు. ఎంత అయినా డాక్టరు కదా అనుకొన్నారు మిత్రులు.

శేఖర్ మెడలో పూలదండలు వేసి ఆప్యాయంగా కౌగలించుకొన్నారు. శేఖర్ జ్యోతి కోసం చుట్టూ చూశాడు కానీ... ఆమె లేదు.

"జ్యోతి రాలేదేం? నా కేబుల్ అందలేదా?" అన్నాడు.

"అందింది, ఆమెకు కాస్త అర్జంటు పని ఉండి — రాలేకపోయింది. అందుకామె ఎంతో బాధపడింది" అన్నాడు రాజా.

"అవును, రావాలని చాలా ట్రై చేసింది. కానీ వీలుకాలేదు" సమర్థించాడు వినోద్.

శేఖర్ బాధగా "జ్యోతిని చూసి ఐదు సంవత్సరాలు అయింది. ఇక్కడికి తప్పక వస్తుందని ఎంతో ఆశపడ్డాను" అన్నాడు.

అరగంటలో కస్టమ్స్‌వాళ్ళను వదిలించుకొని, లగేజీతో బయటకొచ్చి టాక్సీ ఎక్కారు స్నేహితులు ముగ్గురూ.

"జ్యోతి"

"ఆఁ...ఏమిట్రా మీ ఊరి సంగతులు?" అన్నాడు శేఖర్.

"ఏమిట్రో... ప్రదేశం మారగానే 'మీ' అని సంబోధిస్తున్నావు!" అన్నాడు రాజా ఆశ్చర్యంగా.

"ఏదో సరదాకి అన్నాను లేరా; అరె!... ఈ ఐదేళ్ళలో సిటీ చాలా అధునాతనంగా తయారు అయిందే!" కూలింగ్ గాగుల్స్‌లో నుండి బయటకు చూస్తూ అన్నాడు శేఖర్.

బయట నూతనంగా, ఎత్తుగా వెలిసిన బిల్డింగులు, ఎన్నో రకాల దుకాణాలు అతన్ని ఆశ్చర్యచకితుణ్ణి చేస్తున్నాయి.

ఏమైనాయ్?

ఏమైనాయ్?
ఆ మధుర సఖీ
సల్లాప ఉల్లాసాలు?

ఏమైనాయ్?
ఆ విరి చూపుల
మదన తూపులు?

ఏమైనాయ్?
ఆ వసంతాగాయ
విహార విలాసాలు?

కాకులు కూస్తువుంటే
కోకిల గొంతు నొక్కి
పాతుకుపోయిన విష వృక్షానికి
నువ్వూ ఒక వేరువై
భీరువుగా పారిపోతున్నావా?
నన్ను ఒంటరిని చేసి?!

— మల్లిక్

"శేఖర్, అక్కడ నీకెలా ఉంది. ప్రదేశం బాగా పడిందా" అడిగాడు వినోద్.

"బ్రహ్మాండంగా పడింది. అదిసరే కాని జ్యోతివాళ్ళ అమ్మగారు ఎలా ఉన్నారు? హౌ ఈజ్ హర్ మదర్?"

హఠాత్తుగా శేఖర్ అడిగేటప్పటికి మిత్రులిద్దరూ ఉలిక్కిపడ్డారు. ఒకరి ముఖం, ఒకరు చూసుకొన్నారు.

"ఏమిట్రా మాట్లాడరేం! వాట్ హాపెండ్?" అడిగాడు శేఖర్.

ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు — రాజాకు, వినోద్‌కు. చివరికి నెమ్మదిగా నోరు విప్పాడు రాజా "శేఖర్... మనిషి జీవితంలో ఒక్క ఘడియ ముందు ఏమి జరుగుతుందో ఊహించలేము. అలా తెలిస్తే మనం జాగ్రత్త పడి, తన సృష్టికి ప్రతిసృష్టి చేస్తారని భయం అనుకొంటాను ఆ భగవంతుడికి" అని ఆపి శేఖర్‌ను చూడసాగాడు.

శేఖర్‌కు ఏమీ అర్థం కాలేదు. "రాజా... వాట్ డు యూ మీన్...స్పీక్...టెల్ మీ?" ఆదుర్దాగా అడిగాడు రాజా భుజం కుదుపుతూ శేఖర్.

"నీవు అమెరికా వెళ్ళిన తరువాత జ్యోతి అమ్మగారు శాశ్వతంగా మనల్ని విడిచి వెళ్ళిపోయారు" అన్నాడు బాధగా.

ఊహించని ఆ జవాబుకు అదిరిపోయాడు శేఖర్ "మరి నాకు ఎందుకు ఈ విషయం వ్రాయలేదు" అన్నాడు బాధగా.

"జ్యోతి, ఈ విషయం నీకు వ్రాసి నీ చదువు పాడుచెయ్యవద్దు అన్నది" అన్నాడు వినోద్.

జ్యోతి అమ్మగారి మరణవార్త వింటేనే ఇంత చలించిపోయిన శేఖర్, జ్యోతి విషయం తెలిస్తే ఏమైపోతాడో ఊహించలేకపోతున్నాడు రాజా.

"నన్ను ఎంతగానో ఆదరించి, తల్లి-దండ్రుల్ని సైతం మరపించి, పై చదువులు చదివి గొప్ప డాక్టరు అయి, ఎంతోమందికి ప్రాణదానం చేయాలని దీవించిన ఆ మాతృదేవత ఇక లేదా? ఓ... గాడ్ ఇలా జరుగుతుందని కలలో కూడా వూహించలేదు!" శేఖర్ కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

"శేఖర్... బాధపడకు" అని ఓదార్చారు మిత్రులు.

"డ్రైవర్... త్వరగా పోనీయ్" అన్నాడు శేఖర్.

"శేఖర్... మా యింటికి వెళ్ళి, తర్వాత జ్యోతిని చూడటానికి పోదాం?" అన్నాడు రాజా.

"వీల్లేదు, తల్లిపోయి ఒంటరిగా ఎంత దుఃఖాన్ని దిగమింగి జీవిస్తున్నదో నా జ్యోతి. ముందామెను చూడాలి. నా కోసం ఎంత ఎదురు చూస్తుందో?" అన్నాడు శేఖర్.

"అవును ఎదురుచూస్తూ ఉంటుంది" అని నిట్టూర్చాడు వినోద్. ఆ నిట్టూర్పులో ఏదో ఉంది? భయంకరమైన నిజం ఉంది? లావా వంటి ఆ నిజం, భయంకరమైన ఆ

‘‘జ్యోతి’’

సత్యం తెలిసి శేఖర్ ఎలా ఉంటాడో? పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించలేక పోతున్నాడు వినోద్.

జ్యోతి ఇల్లు దగ్గిర అయ్యేకొద్దీ రాజా, వినోద్‌లు ఏం జరుగుతుందో అని ఆలోచిస్తూ, భయపడిపోతున్నారు.

కారు ఆగింది.

శేఖర్ కారు దిగి ఆతృతగా, స్నేహితులు పిలుస్తున్నా వినిపించుకోకుండా యింట్లోకి పరుగుపెట్టాడు. తన హృదయ సామ్రాజ్ఞిని చూడాలని, మాట్లాడాలని ఆతృతగా ‘‘జ్యోతి ... జ్యోతీ ...’’ అని పిలిచాడు. జవాబు లేదు.

హాలు గదిలో చాపమీద కొన్ని బొమ్మలతో ఆడుకుంటూ రెండేళ్ళ బాబు కన్పించాడు. ఈ క్రొత్త మనిషి ఎవరా అన్నట్టు ఉన్నాయి బాబు చూపులు.

బాబును చూస్తే శేఖర్‌కు ముచ్చట కలిగింది. అచ్చం జ్యోతిలా ఉన్నాడు.

శేఖర్ బాబును ఎత్తుకొని ముద్దు పెట్టుకొన్నాడు. అది చూసి గుమ్మంలో నిలబడి చూస్తున్న రాజా, వినోద్ ఆశ్చర్య పోయారు.

‘‘రాజా ... ఈ బాబు ఎవరు ? భలే ముద్దు వస్తున్నాడు’’ అన్నాడు శేఖర్.

రాజా, వినోద్ ఏమీ చెప్పలేక నేలచూపులు చూడసాగారు.

‘‘నా బిడ్డే !?’’ ఆ మాట విని, శేఖర్ ఎవరా అని వెనక్కి తిరిగి ఒక్కసారిగా షాక్ తిన్నాడు.

తెల్లచీరలో, జుట్టురేగి, చెమటతో ముఖమంతా అందవికారంగా ఉన్న జ్యోతిని చూసి ఇది కలా ? నిజమా ? అనుకొంటూ ‘‘జ్యోతి ... ఏమిటి అలా అయిపోయావు ? ఆ దుస్తులు ఏమిటి ? ఈ బాబు నీ బిడ్డా ? ఇది నిజమా ... కాదు ... కాదు ... ఇది నిజం కాదు. ఒక పీడకల అని చెప్పు జ్యోతి ! అంతా అబద్ధం అని చెప్పు జ్యోతి. ఓ...గాడ్ !... నేను భరించలేను’’ అంటూ కుమిలిపోయాడు.

‘‘అవును శేఖర్! ఇది నిజం. నీవు నమ్మలేని నిజం !’’ అంది.

శేఖర్ ఆవేశంగా ‘‘జ్యోతీ ... ప్రతి క్షణం నిన్నే స్మరిస్తూ, నీవే నా ఆశాజ్యోతి అని, నీతోనే నా జీవితం అని ఎంతో ఆశతో కలలు కన్నాను. ఆ ఆశతోనే ఇంతకాలం నా హృదయంలో నీ రూపాన్ని నింపుకొని జీవించాను. ఆ రోజు ఎయిర్‌పోర్టులో నేను అమెరికాలో ఏ స్త్రీనైనా వివాహం చేసుకొని నిన్ను మోసం చేస్తానేమోనని అనుమాన పడ్డావు. కానీ ఇక్కడ నీవు నన్నూ — నా ప్రేమనూ కాదని వివాహం చేసుకొని నాకు అన్యాయం చేస్తావా ? అంటే... నేనేమైపోవాలనుకున్నావు జ్యోతీ... చెప్పు జ్యోతీ ?’’ అని గద్దించాడు శేఖర్.

ఒక్కొక్క మాట శూలంలా జ్యోతి హృదయాన్ని చీల్చివేశాయి. చీరకొంగును నోట్లో కుక్కుకొని గట్టిగా ఏడ్చేసింది జ్యోతి.

పరిస్థితిని అర్థం చేసుకున్న రాజా ‘‘శేఖర్, ఆవేశపడకు. విధి వ్రాత మనం తప్పించలేము. ఇందులో ఆమె తప్పు ఏమీలేదు. నీవు అమెరికా వెళ్ళిన తరువాత వాళ్ళ యింటిలోకి ఒక వ్యక్తి అద్దెకు దిగాడు. అతను స్వతహాగా చాలా మంచివాడు. ఒకనాడు అతని స్నేహితుల బలవంతంపై బాగా త్రాగి యింటికి వచ్చాడు. ఆ రోజు జ్యోతి ఒక్కతే ఇంటిలో ఉంది. త్రాగిన మైకంలో అతడు పశువుగా మారి ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని తన తృష్ణ తీర్చుకొన్నాడు. మర్నాడు జరిగింది తెలుసుకొని వాళ్ళ అమ్మగార్కి క్షమాపణ చెప్పుకొని జ్యోతికి యిష్టమైతే వివాహం చేసుకుంటాను అన్నాడు. శీలం కోల్పోయి తన ముఖం నీకు ఎలా చూపాలని బాధపడి, నిన్ను మోసం చెయ్యలేక అతన్నే వివాహం చేసుకుంది. కానీ... కానీ... ?’’ రాజు గొంతు గాద్గద మైంది. ఇక చెప్పలేకపోయాడు.

‘‘ఆ భగవంతుడికి జాలి లేదో, ఆ విధికే కన్ను కుట్టిందో జ్యోతి గర్భవతి అయిన ఆరు నెల్లకు అతను అనుకోకుండా లారీ ఆక్సిడెంట్‌లో పోయాడు. ఆ నిజం తెల్సి జ్యోతి అమ్మగారు కుమిలి, కృశించి ప్రాణం విడిచింది. ఈ విషయాలన్నీ నీకు తెలియచేస్తే నీవు భరించలేవని, ఆ షాక్‌లో నీ స్టడీ మానేసి ఇండియాకు తిరిగి వచ్చేస్తావని — భయపడింది. అందుకే మేము కూడా నీకు ఏ విషయమూ వ్రాయలేకపోయాము !’’ అని ముగించాడు వినోద్.

జ్యోతి కథ విన్న శేఖర్ ఆ వ్యక్తిత్వానికి ఎంతో ఆశ్చర్యపోయాడు. తన తొందర పాటుకు సిగ్గుపడ్డాడు. తలెత్తి ఆమెవైపు చూశాడు. తలుపును ఆనుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమెను, ఆమె కళ్ళను చూసి చలించిపోయాడు. ఆ కళ్ళలో మోసం లేదు.

కలకాలం పసుపు కుంకుమలతో పచ్చగా ఉండవలసిన జ్యోతి, నుదుట బొట్టు లేక కళా విహీనంగా ఉన్నది. ముత్తయిదువుగా, నిండుగా, తలలో తురిమిన పూలతో అందంగా ఉండే ఆమె కేశ సంపద అస్తవ్యస్తంగా రేగి వున్నది. శరీర సౌందర్యం మెరిసిపోతూ ఎంతో అందంగా, ఆకర్షణీయంగా ఉండవలసిన చేతులు గాజులు లేక మోడుబారిన చెట్ల కొమ్మలవలె బోడిగా వున్నాయి. పట్టుచీర కట్టి, నిండుగ స్వప్నసుందరిలా ఉండవలసిన జ్యోతి తెల్లని చీరలో బ్రతుకంతా ఇంతే అన్నట్లుగా ఉన్నది.

ఇంత చిన్న వయసులో ఆమె జీవితం చీకటి కాకూడదు. ఆమె జీవితంలో వసంతం చిగురించాలి. అమావాస్య వంటి ఆమె జీవితం పున్నమివెన్నెల కావాలి, నిత్యం ఒంటరిగా బ్రతుకుతున్న ఆమెకు తోడు కావాలి.

శేఖర్ ప్రక్క గదిలోనికి వెళ్ళాడు ? జ్యోతి, రాజు, వినోద్ ఆశ్చర్యంగా చూశారు. వాళ్ళకు ఏమీ అర్థం కాలేదు. రెండు నిముషాల్లో శేఖర్ బయటకు వచ్చాడు. అతని హృదయం తేలికగా ఉంది, ముఖంలో సంతోషం కన్పిస్తున్నది —

‘‘డియర్ ఫ్రెండ్స్ ... నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. ఒకవేళ ఇది మీ దృష్టిలోను, ఈ సమాజం దృష్టిలోను తప్పు అని అనుకొన్నా, నా దృష్టిలో ఇది ఒప్పు, సరైన న్యాయం. ఈ సమాజం ఏమనుకొన్నా నాకు భయం లేదు !’’ అని లోపలనుండి తెచ్చిన కుంకుమను బొటన వ్రేలితో జ్యోతి నుదుటపై పెట్టి, ఒక దండను జ్యోతి మెడలో వేసి, బాబును ఎత్తుకొన్నాడు.

జ్యోతి ఆశ్చర్యపోయింది. రాజా, వినోద్ నమ్మలేకపోయారు.

‘‘జ్యోతీ ! నిన్ను నేను ప్రేమించాను. నిన్నే సర్వస్వం అనుకొన్నాను. నీకే నా గుండెలో గుడి కట్టాను. అందుకే నీకు భర్తగా, బాబుకు తండ్రిగా మిమ్మల్ని కోరుకుంటున్నాను !’’ అని ముగించాడు.

జ్యోతి తనకి అంత అదృష్టం కల్గించిన శేఖర్ గుండెలపై ఆరాధనగా చూస్తూ ఒదిగిపోయింది. ★